క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి టౌన్: పట్టణంలోని 17వ వార్డు యల్లనూరు రోడ్డు విజయలక్ష్మి హాల్ వద్ద నుంచి మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక


ఐశ్వర్య


కార్తీక్

పెద్దపప్పూరు: మండల పరిధిలోని కె.నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.ఐశ్వర్య, సి.కార్తీక్ నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు హెచ్‌ఎం కుళ్లాయప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ వరకూ ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు: మండల కేంద్రానికి సమీపంలోని పేకాట స్థావరంపై సోమవారం దాడి చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.12,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

స్పృహ తప్పిన గుర్తు తెలియని వ్యక్తి



గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన స్పృహ తప్పి పడి ఉన్నాడు. ఆదివారం ఉదయం నుంచి అతను అక్కడే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఇంత వరకూ అతడ్ని కనీసం ఆసుపత్రికి కూడా తరలించ లేదు. పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్నా ఇటు పోలీసులు కాని అటు అధికారులు కాని స్పందించ లేదు. ప్రస్తుతం ఆ వ్యక్తి కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతున్నాడు.

ఆలయానికి విరాళం

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని పులగుట్టపల్లి చిన్నతండా గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సుంకులమ్మ ఆలయానికి ఎమ్మెల్యే వైవీఆర్ సోమవారం రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మోహన్‌రావు, సచివాలయ కన్వీనర్ గోవిందు నాయక్, పులగుట్టపల్లి చిన్నతండా వాసులు పాల్గొన్నారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలోని ఓపెన్ ఎయిర్ జైలు ఖైదీలకు వైద్య పరీక్షలను నిర్వహించినట్లు శింగనమల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ నాయక్ తెలిపారు. జైలు సూపరింటెండెంట్ చిన్నారావు ఆదేశాలతో సోమవారం జైలులోని 31 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు చేశామన్నారు. అనంతరం ఖైదీలకు ఆరోగ్య సూచనలిచ్చారు. కార్యక్రమంలో జైలు సీఐ శివశంకర్, ఫార్మాసిస్ట్ పవన్, ఎంఎన్‌ఓ నాగేంద్ర పాల్గొన్నారు.

రేపు సుంకం వసూలుకు వేలం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకూ దినసరి మార్కెట్, జంతు వధశాలల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కుల కోసం ఈనెల 29వ తేదీన ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. ఆసక్తి గల ఔత్సాహికులు షరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనవచ్చునన్నారు.

వైకుంఠ రామస్వామి అలంకారంలో శ్రీరాముడు



తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని ఆర్‌వీ స్వామి కల్యాణ మండపంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు సోమవారం రాత్రి శ్రీవైకుంఠ రామస్వామి అలంకారంలో శ్రీరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. రంగు రంగుల పూలతో అలంకరించిన స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భూమా హరినారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలు

పామిడి: మండలంలోని ఎద్దులపల్లిలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం శ్రీకృష్ణుని విగ్రహాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామవీధుల్లో శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని భక్తిగీతాల మధ్య ఊరేగించారు. శ్రీరామనవమి పండుగతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని గ్రామస్తులు తెలిపారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ


యాడికి: వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


పెద్దవడుగూరు: ఆసరా సంబరాల్లో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

పెద్దవడుగూరు: మహిళాభ్యున్నతికి ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళా సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండటానికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందినట్లు వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలకు రుణ మాఫీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 707 సంఘాలకు 6.20 కోట్లను డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు అందించడం జరుగుతోందన్నారు. వచ్చే సంవత్సరం 4వ విడత అందించడం జరుగుతుందని తెలిపారు. అమ్మ ఒడి, డ్వాక్రా రుణాలు మాఫీ, సున్నా వడ్డీ డబ్బులు, విద్యా దీవెన్న, విద్యాకానుక, జగనన్న వసతి దీవెల లాంటి పథకాలతో ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారికే సంక్షేమ పథకాలు అందినట్లు చెప్పారు. నేడు అలా జరగకుండా ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం ఉండాలని గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దవడుగూరు మండలంలోని రైతులకు గత ప్రభుత్వం ఎప్పుడూ రెండు పంటలకు సాగునీరు అందించిన దాఖలాలు లేవన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండేళ్లుగా రైతులకు రెండు పంటలకు సరిపడా సాగు నీరు అందించడం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామి యాదవ్, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, శేషారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ కడదరగుట్టపల్లి హరినాథరెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తున్నారు..

యాడికి: మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని చౌడేశ్వరీ కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పథకాలకు పేరిట మహిళల ఖాతాల్లో రూ.4,355 కోట్లు అందించారని కొనియాడారు. చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇస్తే అందులో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలతో మహిళాభివృద్ధికి బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మహిళలు అండగా నిలవాలని కోరారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక పురోగతి సాధించేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, సొంతంగా వ్యాపారాలు నిర్వహించేలా సహకరిస్తున్నామని తెలిపారు. మహిళా పాడి రైతులను ప్రోత్సహించేందుకు పాడి పశువులను పంపిణీ చేస్తున్నామన్నారు. అంతకుముందు వైఎస్సార్ ఆసరా మహిళా స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మహిళా సర్పంచులు, మహిళా ఎంపీటీసీలతో కలిసి ఎంపీపీ బొంబాయి ఉమాదేవి తదితరులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, సర్పంచు అనురాధ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుంతకల్లులో ఆసరా సంబరాలు..

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం జరిగే వైఎస్సార్ ఆసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో మెప్మా అధికారులు, సిబ్బంది, ఆర్‌పీలు, సమాఖ్య లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ భవాని, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్ మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా ద్వారా 1,335 డ్వాక్రా సంఘాల్లోని 13,022 మంది మహిళల ఖాతాల్లో రూ.9.37 కోట్లు జమ చేయడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా డ్వాక్రా సంఘాల సభ్యులకు మెగా చెక్కు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం కమిషనర్ శేషన్న, మెప్మా అధికారులు ఆసరా ఉత్సవాల కోసం ఎస్‌జేపీ హైస్కూల్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశంలో మాజీ చైర్మన్ రామలింగప్ప, సీఎంఎం భవానీ, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

గుత్తిలో రామ్ చరణ్ జన్మదిన వేడుకలు

గుత్తి: ప్రముఖ తెలుగు హీరో, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదిన వేడుకలను సోమవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం, షిర్డీ సాయిబాబా దేవాలయాల్లో పూజలు చేయించారు. అనంతరం అమృత్ సినిమా థియేటర్‌లో కేక్ కట్ చేశారు. జై రామ్ చరణ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రామ్ చరణ్ అభిమాన సంఘం జిల్లా, మండల నాయకులు పాటిల్ సురేష్, బోయగడ్డ బ్రహ్మయ్య, హరికృష్ణ, ఓబులేసు, కృష్ణ, షేక్ వలి, అనిల్, చిరంజీవి, సందీప్, ఆర్‌బీ కృష్ణమూర్తి, వెంకటరాముడు, తపిల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


ఎర్రిస్వామి మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర కాలనీలో వార్డు మెంబర్ మనెమ్మ భర్త ఎర్రిస్వామి గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి ఎంపీటీసీ సుజాత, బుల్లే రాజా, ప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జగనన్న చెప్పారంటే.. చేస్తారంతే

- వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ తీర్మానం చేయడం హర్షణీయం
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


వాల్మీకి మహర్షి, సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాయలసీమలోని వాల్మీకి, బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం హర్షణీయమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు పట్టణ వాల్మీకి సంఘం నాయకులు సీఎం జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం పాతగుంతకల్లులోని వాల్మీకి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహర్షి వాల్మీకి, సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్ చేసి కులసంఘం పెద్దలకు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగన్ తన పాదయాత్ర ద్వారా రాయలసీమ జిల్లాల్లోని వాల్మీకి, బోయ కులస్తుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, వారి జీవన ప్రమాణాలను కళ్లారా చూశారన్నారు. అధికారంలోకి రాగానే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తానని ఇచ్చిన హామీ మేరకు ఏకసభ్య కమిషన్ ద్వారా క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయించి నివేదిక ఆధారంగానే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు వెల్లడించారు. పార్లమెంట్‌లో కూడా బిల్లు ఆమోదం పొందేలా సీఎం జగన్ కృషి చేస్తారని వెల్లడించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, వాల్మీకి సంఘం అధ్యక్షుడు చాముండేశ్వర్, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు మాట్లాడుతూ.. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేయించాలని కోరారు. వాల్మీకి కల్యాణ మండపం అభివృద్ధికి ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే వైవీఆర్ చెరో రూ.20 లక్షల చొప్పున మంజూరు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, ఎంపీపీ మాధవి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు ప్రభాకర్, భాస్కర్, చెన్నమ్మ, నాగరత్నమ్మ, రవీంద్ర, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిమి రామాంజి, వాల్మీకి సంఘం పెద్దలు వాటర్‌షెడ్ మస్తాన్, పాండు, సుంకప్ప, సూర్యనారాయణ, బట్టీల రామాంజినేయులు, చక్రవర్తి, దర్గానాయుడు, మార్కెట్ వెంకటేష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సన్మానం..

గుంతకల్లు రూరల్: ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గుత్తి మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.5 లక్షలు, పామిడిలోని పామిడమ్మ వీధిలో కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, గుంతకల్లు మండలంలోని నరసాపురం గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు, నెలగొండలో శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.6 లక్షలు మంజూరు చేసింది. ఈ క్రమంలో సోమవారం మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నక్కా భీమలింగప్ప ఆధ్వర్యంలో నరసాపురం గ్రామస్తులు ఎమ్మెల్యే వైవీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పూల మాలలతో సత్కరించారు.

సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 17వ వార్డు రాగితోట పాలెంలో సోమవారం మధ్యాహ్నం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. యల్లనూరు రోడ్డు సర్కిల్ సమీపంలోని వినాయక కాంప్లెక్స్ వద్ద నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు శివయ్య, దూల రఘు, రాజేష్, బాల కుళ్లాయప్ప, బింగి ప్రసాద్‌తో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, పథకాలను వివరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చదివి వినిపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా సీఎం అడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హరినాథరెడ్డి, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచెం రామమోహన్‌రెడ్డి, కౌన్సిలర్ రాఘవేంద్ర, మాజీ కౌన్సిలర్లు బాబు, రంగనాథరెడ్డి, వరదలయ్య, సాయి, నాయకులు ఆకుల పెద్దనాగిరెడ్డి బాబయ్య, బట్ట రాజా, బాబా, రామచంద్ర, అన్వర్, జబ్బార్‌బాషా, గడ్డం గణేష్, కల్లూరు శ్రీనివాసులు, లక్ష్మీరంగయ్య, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.46.49 లక్షల ఆదాయం

గుంతకల్లుటౌన్: మున్సిపాల్టీ పరిధిలో పబ్లిక్‌మార్కెట్, మాంసపు దుకాణాలు, పశువధశాల, గొర్రెలు, మేకల వధశాలల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కులను కల్పించేందుకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు నిర్వహించిన వేలంపాటల ద్వారా మున్సిపాల్టీకి రూ.46.49 లక్షల ఆదాయం లభించింది. సోమవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో కమిషనర్ బండి శేషన్న, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. దినసరి కూరగాయల మార్కెట్, మున్సిపాల్టీ పరిధిలోని రోడ్డు మార్గాల్లో విక్రయదారుల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కులను వీఎం.రామాంజినేయులు అనే వ్యక్తి రూ.41.10 లక్షలకు దక్కించుకున్నారు. దినసరి మాంసపు దుకాణాల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కును కూడా రామాంజినేయులు రూ.2.60 లక్షలకు దక్కించుకున్నారు. అంతేకాకుండా జంతువధశాల (బీఫ్ అంగళ్లు) నుంచి సుంకం వసూలుకు రూ.1.35 లక్షలు, గొర్రెలు, మేకల మాంసపు జంతువధశాల నుంచి సుంకం వసూలు చేసుకోవడానికి రూ.1.44 లక్షలకు రామాంజినేయులు దక్కించుకున్నారు. కాగా కాంట్రాక్టర్‌లు సిండికేట్‌గా ఏర్పడటంతోనే నాలుగు వేలంపాటలు ఒకే కాంట్రాక్టర్‌కు దక్కాయి. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ ఎర్రిస్వామి, సీనియర్ అసిస్టెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చిరుధాన్యాలతో ఆరోగ్యం

శింగనమల: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారని ఎంపీడీఓ నిర్మలాకుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మూడో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ యోగేశ్వరి మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలు, కిశోర బాలికలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ , సీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్‌వైజర్ హేమజ్యోతి, అంగన్‌వాడీ వర్కర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోండి

బుక్కరాయసముద్రం: విద్యార్థులు గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని రేగడి కొత్తూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారామి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగడి కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో సింగమనేని నారాయణ జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మహాకవి గుర్రం జాషువా సాహిత్ర పీఠం వారు పుస్తకాలను బహూకరించారు. ఉపాధ్యాయులు రమణయ్య, చితంబరి రెడ్డి, వన్నప్ప, సర్దార్‌వలి, హరిహర నాథ్, శ్రీలక్ష్మి, హరిణి, మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గుత్తి: పట్టణ శివారులోని గుత్తి–అనంతపురం రోడ్డులో శరవేగంగా తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం తాగునీటి పైప్‌లైన్ పనులను మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వన్నూర్‌బీ మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్లు, తాగునీటి పైప్‌లైన్‌లు వేసి నీటి ఎద్దడిని నివారిస్తామన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు

గుంతకల్లు: విద్యార్థులు పట్టుదలతో చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని గుంతకల్లు సబ్ రిజిస్ట్రార్ షామీర్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి ఫలితాలు సాధిస్తే ఉత్తమ భవిష్యత్ ఉంటుదన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్‌యాదవ్, హైస్కూల్ హెచ్‌ఎం సావిత్రమ్మ, జేవీవీ నాయకులు సీ.చంద్రశేఖర్, మహేష్, రంగస్వామి పాల్గొన్నారు.

రేపు కొట్టాలపల్లిలో చెక్కభజన

గార్లదిన్నె: కొట్టాలపల్లిలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈనెల 29 రాత్రి చెక్కభజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. భజన చూసేందుకు వచ్చిన వారికి భోజన వసతి కల్పిస్తామన్నారు. అలాగే 30వ తేదీన సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్నామన్నారు.

క్రైస్తవ మత ప్రచారంపై ఆక్షేపణ

పామిడి: రామరాజుపల్లిలో సోమవారం క్రైస్తవ మత ప్రచారాన్ని గ్రామస్తులు ఆక్షేపించారు. కొందరు క్రైస్తవ మత ప్రచారకులు గ్రామంలో క్రైస్తవ మతానికి సంబంధించిన ప్రచారంతో కూడిన ప్రతుల పంపిణీకి యత్నించారు. మా గ్రామంలో సుంకులమ్మ, ముత్యాలయ్య గ్రామదేవతలను ఆరాధిస్తామంటూ మత ప్రచారకులను గ్రామస్తులు అడ్డుకున్నారు. శ్రీరామనవమి పండుగ నేపథ్యంలో ఈ మత ప్రచారం చేపట్టడం ఏమిటంటూ క్రైస్తవ మతప్రచారకులను గ్రామస్తులు వెనక్కు పంపారు.

నిరుద్యోగితపై ఇంటింటి సర్వే

గుంతకల్లు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్‌ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బసెట్టి క్రిష్టయ్య సూచించారు. శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల బృందం సోమవారం కసాపురంలో రెండవ రోజు ఇంటింటా సర్వే చేపట్టారు. విద్యావంతులు, నిరుద్యోగులు, అక్షరాస్యత తదితర వివరాలను సేకరించే క్రమంలో భాగంగా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ

పెద్దపప్పూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేయడం జరుగుతుందన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

గార్లదిన్నె: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని రైతు సంఘం నాయకుడు నాగరాజు కోరారు. సోమవారం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. చెన్నారెడ్డి, రాముడు, నాగమ్మ, నల్లప్ప, భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ పూజ

యల్లనూరు: మండలంలోని వెన్నపూసపల్లి హైస్కూల్లో సోమవారం 10వ తరగతి విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ మనోహర్, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు భోగాతి నారాయణరెడ్డి మాట్లాడుతూ..10వ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి మండల టాపర్లుగా నిలవాలన్నారు. అనంతరం జ్ఞాన పరివర్తన ట్రస్టు అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్: స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. వన్‌టౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు సోమవారం ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అనాథ మృతదేహాన్ని హిందూ శ్మశాన వాటికకు తరలించి అంతిమసంస్కారాలు చేశారు. ఆ నలుగురు సేవాసమితి సేవలను పోలీసులు అభినందించారు. కార్యక్రమంలో ఆ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సభ్యులు రవీంద్ర, లింగేశ్వర్, పురుషోత్తం, మహేష్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న మోదీ'

గుంతకల్లు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలు బొమ్మగా మారిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దౌల్తాపురం ప్రభాకర్ ఆరోపించారు. రాహుల్ గాంధీకి విధించిన జైలు శిక్షకు నిరసనగా పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన రహదారిలోని గాంధీ చౌక్‌లో సంకల్ప సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రూ.వేలాది కోట్ల కుంభకోణంలో ప్రధాన సూత్రధారి అదానీపై పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పలేక అనర్హత వేటు వేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు చరమగీతం పాడుతారని స్పష్టం చేశారు. నాయకులు జేబీ సురేష్, లక్ష్మీనారయణ, మహబుబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

గుత్తి రూరల్: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని గుత్తి ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ నాగేశ్వరి సూచించారు. సోమవారం మండలంలోని అబ్బేదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పౌష్టికాహారం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పౌష్టకాహారంలో మినుముల పాత్రపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఏఎన్‌ఎం లక్ష్మి, హెచ్‌ఎం సుంకన్న, పాల్గొన్నారు.